# పెంచిన ప్రేమ

ఇంటర్మీడియెట్ పరీక్ష ఫెయిల్ అయ్యాను. దాంతో పెట్టుకున్న ఎన్నో ఆశలు కుప్పకూలిపోయాయి.

మా పల్లెటూరు నుంచి కాలేజీలో చేరిన తొలి విద్యార్థిని నేనే. రెండేళ్లు విశాఖపట్నంలో మిసెస్ ఎ.వి.ఎన్.కాలేజీలో చదువు. కాలేజీలో చదువుకుంటున్నందుకు ఊళ్లో అంతా సంతోషించారు. ఎంతో ప్రేమగా చూసేవాళ్లు ఇప్పుడు పరీక్ష ఫెయిలయినట్టు తెలిసి..... ఈ మాత్రం చాలు ఈ దౌర్భాగ్యుడు కన్నీళ్లు పెట్టుకోవటానికి.

ఊళ్లోవాళ్ల ముఖాల్లోకి చూడలేకపోతున్నాను.

నాన్న కోప్పడలేదు. కాని బాధపడుతున్నాడు.

నన్ను కాలేజీలో చేర్పినప్పుడు ఎంతో సంతోషపడ్డాడు నాన్న.

ఊళ్లో జనం జాలిగా చూస్తున్నారు నన్ను. వాళ్లు నన్నేం నిందించటం లేదు. వాళ్లకి నా మీద ప్రేమ తగ్గదు. తల్లిలేని పిల్లవాడినని ప్రేమ. ఆ ప్రేమ ఎన్నటికీ పోదు. వారి ప్రేమ వల్ల కూడా నాకు బాధగా ఉంది.

నా స్నేహితుడు కృష్ణ కూడా పరీక్ష ఫెయిల్ అయ్యాడు. లాయరు గారి అబ్బాయి. పట్నంలో పుట్టి, పట్నంలోనే చదువుకున్న విద్యార్థి. కృష్ణ కూడా ఇంగ్లీష్‌లోనే తప్పాడు. సెప్టెంబర్‌లో పరీక్ష రాస్తాడట. సెప్టెంబర్‌లో ఇంగ్లీష్ పరీక్ష రాయాలి. పాసవ్వాలి. ఇప్పుడు ఊళ్లో ఈ అవమానం మాత్రం తప్పదు.

నిజంగానే తప్పు చేశానా?

తప్పుచేశానని ధృవపరచినట్టు పరీక్షపోయింది.

ఈ అవమానం భరించాల్సిందేనా?

ఊరునుండి కొన్నాళ్లు ఎక్కడికన్నా పారిపోవాలి. ఊళ్లో ఉండ వద్దు. పరీక్షపాసయ్యేవరకు ఊరుకు దూరంగా ఉండడం మంచిది.

ఇప్పుడు కొన్నాళ్లు పెద్దనాన్నమ్మ దగ్గరకుపోయి......

ఊహూ..... అక్కడ కూడా-అంతా తను కాలేజీలో చదువుకుంటున్న సంగతి తెలిసినవాళ్లే.

ఎక్కడికి వెళ్లను! ఎవరున్నారు నా కన్నీళ్లు తుడవటానికి? నా బాధ ఎవరితో చెప్పుకోను? ఎవరు ఓదారుస్తారు నన్ను?

ఈ చింతల్లో, అవమానాల్లో బతుకు ఈడుస్తుండగా మరొక దుర్వార్త.....నాకోసం ఉంచిన నా మేనగోడల్ని ఎవరికో ఓ అదృష్టవంతునికి ఇచ్చి పెళ్లిచేస్తున్నారట.

లోకం దౌర్భాగ్యులను క్షమించదు. ఛీత్కారాలతో, అవమానాల్తో కుళ్లబొడుస్తుంది. కన్నీటికి కరగని పాషాణమే ఈ లోకం.

మెరుపులాంటి స్మృతి పునీతుడ్ని చేసింది. రక్షచూపింది. ఆశతో హృదయం వికసించింది. కళ్లు విప్పారాయి.

అమ్మ..... పెంచిన అమ్మ...... అమ్మ చనిపోయిన తర్వాత నాలుగేళ్లు తనదగ్గరే ఉంచుకుని పెంచిన అమ్మ..... అమ్మ దగ్గరకు వెళ్లాలి. అమ్మని చూడాలి.

అమ్మ చనిపోయిన తర్వాత తనే అమ్మయి నన్ను కాపాడిన అమ్మ. అమ్మ ఉంటున్నది దగ్గర్లోనే. పన్నెండు మైళ్లు దూరం. నడచివెళ్లొచ్చు పెదనాన్నమ్మ ఊరు అరవైమైళ్లు, రైల్లో వెళ్లాలి.

వెళ్లి అమ్మ పాదాలు పట్టుకుని బోరుని ఏడవాలి. ఆ ప్రేమ వాత్సల్యాల మాతృమూర్తి ఒడిలో తలపెట్టుకుని గుండెల్లోని వేదనంతా వెళ్లగక్కుకోవాలి. పెంచిన ప్రేమ. అమ్మకి పిల్లల్లేరు. బాలవితంతువు. నుదుట బొట్టులేదు.

వేసవికాలం.

మండుటెండలు. వడగాల్పులు. ఉదయమే చల్లంది తిని బయల్దేరాను. రోడ్లులేవు. కాలినడకనే తోటల్లోంచి పన్నెండుమైళ్లు నడిచిపోవాలి. కొబ్బరితోటల్లోంచి. చెట్లనీడల్లోంచి. పెద్ద కష్టం ఏమీకాదు. వెళ్లగలను.

దారితెలీదు. కాని దారిలో వచ్చే ఊళ్లల్లో అడిగితే చెప్తారు. తోటల్లో కూడా జనం ఉంటారు.

అమ్మ దగ్గరకు వెళ్తానని నాన్నమ్మతో చెప్పాను ముందే. నాన్నకి నాన్నమ్మే చెప్తుంది.

ఎండకి ఇసుక వేడెక్కి పాదాలు కాల్తున్నాయి. చెప్పుల్లేవు. చెప్పులు పాడయ్యాయి. బాగు చేయించుకోలేదు. కొత్తవి కొనుక్కోవాలి. చెట్లనీడలు వెతుక్కుంటూ నడుస్తున్నాను.

దారిపొడుగునా తోటలే. కొబ్బరితోటలే. అయినా మధ్యమధ్య మామిడి, జీడి, పనస, అరటి చెట్లు. తాటిచెట్లు. రుతువుల అందాలను అలంకరించుకున్న చెట్లు. మామిడి పళ్లతో, పనస పళ్లతో, జీడి పళ్లతో తోటలు..... తోటల్లో రైతులు ఆడామగా.

ఓ తోటలో ఒకామె.... నన్ను చూసి 'ఎక్కడికి పోతున్నావు ఈ ఎండలో నాయినా?' అని పలకరించింది. చెప్పాను ఊరుపేరు. 'అంతదూరం ఒక్కడివే నడిచిపోతున్నావా?' అని ఆశ్చర్యపోయింది.మామూలుగా ఎడ్లబండిలో వెళ్లడం ఒక పద్ధతి. ఆమె ఆతోటలో పశువులసాల దగ్గర ఉంది. 'ఆగు' అని తోటలో ఉన్న ఓ మనిషిని పిలిచి 'ఒక నీళకాయి

కొట్టియ్యి ఈ పిల్లడికి' అని కొబ్బరికాయ వొలిపించి ఆ కొబ్బరినీళ్లు తాగించింది. దాంతో దాహం తీరింది. 'ఎండ తగ్గిన తర్వాత చల్లనివేళ పోనాయినా. ఇక్కడ ఉండు' అంటూ ఉంటే-'వెళ్తానమ్మా' అని కదిలిపోయాను. ఆమెను మనసులోనే నమస్కరించుకున్నాను.

మరికొంత దూరం వెళ్లేసరికి మరోతోటలో ఓ తాత కన్పించి 'ఏ వూరు మనది? ఎక్కడికి ఒక్కడివి వెళ్తున్నావు?' అని అడిగితే నా సమాధానం విని 'నాయుడు కొడుకువా?' అని ఆశ్చర్యపోయి-'ఈ ఎండలో వెళ్లొద్దు. ఓ గంటసేపు ఇక్కడాగు'

నేను తటపటాయించడం చూసి 'చిన్న పిల్లవాడివి వొద్దు. ఈ ఎండలో వొద్దు ఇక్కడ ఈ మామిడిచెట్టు కింద-' ఆ మామిడి చెట్టు కింద అతాత నడుం వాల్చుకోవటానికి అన్నట్టు ఓ మంచం ఉంది. ఆ మంచం చూపాడు. నాన్నని ఆయన ఎరుగును. బహుశ బంధువు కూడానేమో. ఆ చెట్టునిండా మామిడికాయలు. పళ్లు అక్కడక్కడ. ఓ పండుని చేత్తో అందుకుని, దగ్గర్లో ఉన్న కత్తి తీసుకుని కోసి నా చేతిలో పెట్టాడు. తినమన్నాడు.

ఆ మంచంమ్మీద కొంచెంసేపు కూచోవాలనిపించింది. ఆ మామిడి పండు తిన్నాను. నిజానికి అప్పటికి ఆకలవుతున్నది. అంతలోనే ఇంకో పండు కోసి ఇచ్చాడు.

ఇంకా సగం దారికి పైనే ఉంది. ఎండలు మండుతున్నమాట నిజమే. కాళ్లు ఆ ఇసిక భూముల్లో కాలుతున్నమాట నిజమే. కాని వెళ్లాలి. చెట్ల నీడల్లో నడుచుకుంటూ పోవాలి.

దార్లో కలిసిన వాళ్లు దారి చెప్తునే ఉన్నారు.

'తలకి ఒక తువ్వాలన్న కట్టుకోలేకపోయావా?'

అమ్మని చివరిసారి చూసి నాలుగేళ్లయింది. హైస్కూల్‌లో చదువు కుంటున్నప్పుడు అమ్మ, చిన్నమ్మ, అక్క, పెద్దపెద్దమ్మ నన్ను చూడటానికే ఓసారి మా ఊరు వచ్చారు. ఆరోజు ఉండి నన్ను తమతో తీసుకుని ఇదే దారిన వెళ్లారు. అమ్మ చూపులో ప్రేమ అందాలతో మెరుస్తుండేది. అమ్మ ముఖంలో ఆ అపురూపవాత్సల్యం అమ్మ ప్రేమేనని ఇప్పుడు తెలుస్తున్నది. బుజ్జీ, బుజ్జీ అని లాక్కుని ముద్దులు పెట్టి ఎంతో సంతోషంతో గలగలానవ్వే అమ్మని నాలుగేళ్లు ఈ చదువుల్లో, పరీక్షల్లోపడి చూడనేలేకపోయాను. నా శైశవం ఆమె అమృతవర్షంతో పెరిగింది. లేకుంటే నేను బతికేవాడినా? నన్ను కాపాడిన దేవత అమ్మ. పసితనంలో పిల్లలు జబ్బులతో ఎంతమంది చనిపోవడంలేదు? పద్దెనిమిదేళ్ల ఈ వయసులో నన్ను చూసి అమ్మ ఎంత మురిసిపోతుందో.....

సముద్రం ఒడ్డునించి కూడా పోవచ్చు. కొంతదూరం. కాని ఆదారి నాకు బొత్తిగా కొత్త. అయితే ఈ ఎండ బాధ తప్పేది. సముద్రం.... సముద్రంలాంటి అమ్మ ప్రేమ.

నిప్పులు కురుస్తున్న ఆమండుటెండలో అంతలోనే నల్లని మేఘాలు. చల్లని గాలులతో చెట్లు ఊగుతూ కర్పూరాలు చల్లుతున్నట్టు చినుకులు. పన్నీటిస్నానం.

ఊరు దగ్గర్లోనే. మనుషులు తోటల్లోని పశువుల సాలల్లోకి పోయినట్టున్నారు. పరుగెత్తాలనిపించింది. ఆ చల్లని వర్షంలో తడుస్తూ....

అదుగో...... తోటలో ఆ ఇల్లే.... అమ్మ అక్కడే ఉంటుంది.

ఆమామిడి చెట్లు, పనసచెట్లు, జీడీచెట్ల మధ్య - ఆ ఇల్లే. అక్కడా అక్కడా ఆరేడేసి ఇళ్లు......

అమ్మ అక్కడ ఆ ఇళ్లల్లో కనిపించలేదు. అంతా తోటల్లో పనుల్లో ఉన్నారో ఏమో. మధ్యాహ్నం భోజనాల సమయం. ఇళ్లల్లో ఉండాలి కదా. ఆ ఇండ్ల అధికారిణి అమ్మ అక్కడ కన్పించలేదు.

అమ్మ కనిపించినా గుర్తుపట్టలేనా నేను?

వర్షం కురుస్తూనే ఉంది. చెట్లు తడుస్తూనే ఉన్నాయి. ఆవులూ, గేదెలూ, మేకలూ, గొర్రెలూ ఆ చెట్లక్రిందనే. తడుస్తూనే ఉన్నాయి.

కుక్క నన్ను చూసి భౌభౌమని అడ్డం పడింది. ప్రక్కనే ఉన్న ఎద్దు కొమ్ములు తిప్పింది పొడిచేందుకు. నాకన్నా బలంగా కండలు తీరిన యువకుడు, చిన్ననాటి నాస్నేహితుడు కనిపించాడు.

'నేనురా కరుణని-'

వాడు నన్ను పోల్చుకోలేదు. నా పేంట్, షర్ట్‌ల కాలేజీ విద్యార్థి వేషం. వాడు పంచెకట్టుకున్నాడు. తలపాగా. బనీను కూడా లేదు. చేతిలో బీడీ ఉంది.

'వెంకటీవి కదా'

అయినా పోల్చుకోలేదు. అనుమానంగా చూస్తున్నాడు.

'అమ్మెక్కడుందిరా?'

వెన్న,మీగడ, పళ్లు, మిఠాయి తినేవాడు నాతోపాటే, అమ్మయిస్తే. నా వయసువాడే. వేరే కులం. పేదవాడు. అయినా అమ్మ-ఎంతోప్రేమతో చూసేది. వెంకటీ అనే అమ్మ పిలిచేది. తనే చదివించింది. అయిదో తరగతి వరకు. ప్రక్కఊళ్లో.

మాటాడడు. వింతజంతువును చూసినట్టు నన్ను చూస్తున్నాడు.

'అమ్మ ఎక్కడుందిరా. నేను కరుణనిరా'

వాడి ముఖం నిండా కాఠిన్యం. స్పర్ధలు, ద్వేషాలు, కోపాలు ముఖంలో గడ్డకట్టుకుపోయినట్టు.

అల్లంతదూరాన ఒక గుడిసె చూపించాడు. చేత్తో. నోరువిప్పడు.

ఆ గుడిసెవేపు నడిచాను.

వర్షం తగ్గింది.

జీవితం సుడిగుండాల్లో, తుఫానుల్లో కరిగిపోయిన కుటీరాలవి. నిద్రలో మరచిపోయిన గతమది.

అమ్మ ఐశ్వర్యాలన్నీ చివరకు యీ గుడిసెగా మారాయా?

ఈ గుడిసెలో అమ్మ.......

అంతరాంతరాల్లో చరిత్రహీనుల మూగవేదన....

గుడిసె సమీపించాను.

హృదయంలో నెత్తుర్ని మండించే జ్వాలలు.

పెద్ద మామిడిచెట్టు. ప్రక్కనే పదిపన్నెండు అరటిచెట్లు. మామిడిచెట్టు కింద పాడి ఆవు. ప్రక్కనే పడుకుని ఉన్న దూడ. మగమేక నుంచుని రొడ్డ తింటున్నది. అవిప్రేమతో చూశాయి. ఆవు కూడా నన్ను గుర్తుపెట్టుకున్నట్టు చూసింది. అంబా అందిలేగ. 'అమ్మా నీకోసం ఓబాబు వచ్చినాడు చూడు' అన్నట్టుంది ఆ లేగ అరుపు. చల్లబడిన ప్రకృతి.

ఆ గుడిసెలోంచే నన్ను చూసి గుర్తుపట్టిందో ఏమో అమ్మ నవ్వు ముఖంతో వచ్చింది. పెంచినప్రేమ ఆ ముఖంలో, ఆ చూపుల్లో. అమ్మ కళ్లల్లో ఆనందాశ్రువులు. చిగురించిన మాతృత్వ చిద్విలాసం.

అమ్మ ఆరోగ్యం ఇప్పుడు పూర్వంలాలేదు. మధ్యలో జబ్బుపడిందో ఏమో. జుత్తు నెరిసింది. ముఖంలో ముడతలు.

'నాయినా' అని దగ్గరకు తీసుకుని బుగ్గల మీద ముద్దుపెట్టుకుని 'ఇన్నాళ్లకు మతిపడ్డానా' అని తన చేతుల్లో పెరిగిన చిన్నారి బాబు ఈ రూపంలో కనబడేసరికి-ఆమె మాతృహృదయం పరవసించసాగింది.

ఇంకా కన్నీళ్లు కురుస్తూనే ఉన్నాయి. కొంగుతో తుడుచుకుంటున్నది.

తాటికమ్మల గుడిసే అయినా లోపల విశాలంగా ఉంది. పాతకాలపు పెద్ద పట్టె మంచం

పోయిన చెల్లెలు మతిపడిందో ఏమో, కళ్లల్లో కనిపించసాగిందో ఏమో..... కన్నీళ్లు ఆగటం లేదు.

మంచంమీద కూర్చున్నాను.

ఓ పెద్దగ్లాసులో చల్లని మజ్జిగ తెచ్చిఇచ్చి, ప్రక్కనే కూర్చుని.

ఇప్పుడు స్పష్టం తన చెల్లెల్నే చూసిన ఆనందం......

అంతవరకు అంతా కొత్తగా చూస్తున్నవాడినల్లా అమ్మ ఒళ్లో తలపెట్టుకుని 'అమ్మా'

అని కన్నీళ్లు పెట్టుకున్నాను. ఎంతసేపు అట్లా ఏడ్చానో.... అమ్మ నా కండ్లుతుడుస్తూ, నా వీపురాస్తూ, అట్లాగే కూర్చుండిపోయింది.

చాలాసేపు గడిచిన తర్వాత కోలుకున్న అమ్మ-

'ముందు తిండి తిను. కూరలేం చెయ్యిలేదు. పెరుగన్నం తిను.... లే..... లే...... నీళ్లు పోసుకుని (స్నానంచేసి) రా నాయినా' అని మామిడిచెట్టుకూ-అరటిచెట్లకూ మధ్య ఉన్న ఓ చాపరాతి దగ్గర బకెట్‌తో నీళ్లు పెట్టింది. వర్షంలో స్నానం చేసినప్పటికీ, మళ్లీ స్నానం.

* * *

'యీలంతా (వీళ్లంతా) కలిసి నీ తల్లిని తినేసినార్నయినా. నీ విక్కడుంటే నా కదే బయ్యిం. పాడు బుద్దులు. పాడు మనుసులు. పాడు రోజులు......'

అమ్మ ఈ మనుషుల గురించి చెప్తూ ఉంటే..... చావు భయం కలగసాగింది.

అమ్మ కళ్లు ఇంకా కన్నీళ్లు కురుస్తూనే ఉన్నాయి.

అమ్మ ప్రేమకీ, నిస్సహాయతకీ మధ్య పెనుగులాడుతున్నది.

అత్తగారింట్లో అమ్మ పడ్డ కష్టాలు, అవమానాలు, దుఖ్ఖాలు అమ్మ కథలు కథలుగా చెపుతూనే ఉంది. చిన్నవయసు. తట్టుకోలేక పోయింది. అత్తవారింటిని వొదిలేసి ఇక్కడికి అమ్మమ్మ ఊరు, నడివేసవిలో సూర్యుడు నిప్పులు కక్కుతున్న ఎండలో వచ్చేసింది. ఏడాది కూడా నిండని కొడుకును ఎత్తుకుని వచ్చేసింది.

'ఉండు. ఇక్కడే ఉండు. మాలాగే ఉండు. మల్లా ఆ ఊరు వెళ్లకు' అని ఓదార్చి 'ఆ ఊరులో మల్లా అడుగుపెట్టకు. ఆ ఊరుతో నీకు రుణం తీరిపోయింది. అని అందరం సెప్పినాము.'

నలుగురు అమ్మమ్మలు. అంతా కన్నీళ్లు పెట్టుకున్నవాళ్లే.

అక్కడకు చేరిన రెండోరోజు సాయంత్రం వరకు నా పరీక్షపోయిన సంగతి అసలు గుర్తేలేదు. మనసంతా అమ్మ ప్రేమతో నిండి పోయింది. అమ్మ ముచ్చట్లే. అమ్మంటే ప్రేమ. ఆ ముద్దుముచ్చట్లే.

నా నోరు మూతపడింది. అమ్మ చెప్తున్నవి వినటమే. నేను చెప్పేవి ఏమీ లేవు. అర్ధరాత్రి......

మనసు ఎంతో శాంతిగా ఉంది.

బైటికి వచ్చి చూసాను. చీకటి. వినువీధిలో తారకల తళతళలు.

అమ్మ నా చిన్ననాటి ముచ్చట్లు చెపుతూనే ఉంది.

మాఘమాసం. వేకువజాము. సముద్రస్నానాలకోసం వేకువజామునే వెళ్లేవాళ్లు. అమ్మ

కదిలితే అమ్మతో పాటే నిద్రలేచి వెంట పడేవాడినట. నాకూ జ్ఞాపకం ఉంది. 'అమ్మా నాతో చందమామ కూడా పరుగెడ్తున్నదే..... ఎందుకమ్మా అలా....' అని అడిగేవాడినట.

సముద్రస్నానాలు. తర్వాత మంచినీటి చెరువుల్లో స్నానాలు. అమ్మ తనతో పాటే తీసుకుపోయి ఒడ్డున స్నానం చేస్తుంటే, అమ్మ చీర నీటి మీద అందంగా తేలింది. చూసి, 'అమ్మ చీర మీద పడుకుంటా' అని ఆ నీటి మీద తేలిన చీరమీద పండుకుని నీటిలో మునిగి పోయానట. అమ్మ భయపడిపోయింది. కోపమొచ్చి అమ్మ గట్టిగానే రెండు కొట్టిందట. ఆ రెండోదినమే నన్ను తీసుకు రమ్మని మామని, అమ్మ దగ్గరకు నాన్న పంపించాడట. 'అమ్మ కొట్టింది.... కొట్టింది' అని మామతో వెళ్లిపోయానంట.... నాన్న దగ్గరికి. అమ్మ ఈ కథలన్నీ చెపుతుంటే-అమ్మ నన్ను స్మరించుకోని రోజు లేదని పించింది. కలల్లో ఆ నాలుగయిదేళ్ల బుజ్జిగానే కనిపించేవాడినట.

అమ్మ అత్తవారింట్లో పడ్డ కష్టాలు తవ్వుతోంది.

'ఆ పొద్దు(ఆవేళ) మసాబుగా ఉంది. ఇద్దరం జనపగుడ్డి(గోంగూరతోట)లో కూర ఏరుతున్నాం. ఆ చుట్టు పక్కల యెవరూ లేరు. మా ఇద్దరమే. సెల్లెలు అత్తోరింటి కష్టాలు సెప్తున్నాది. నీ నాయినమ్మ ఎన్ని ఇడుములు పెట్టిందో. పొద్దు తిరిగిందాకా గుడ్డి(తోట)లో-మీ గుడ్డి ఊరుకుఅరకోసు(మైలు)దూరం. ఆ గుడ్డిలో గీదల్ని, మొదాల్ని(ఆవుల్ని) చూసి వస్తే-ఇంత గంజి పోసేది. ఇంటిలో నలుగురు వొదిన్లు. ఆళ్ల పెద్దరికం. ఆళ్లు రాసిరంపాన పెట్టే వోళ్లు. మీ అయ్య-అమ్మకీ, అక్కలకీ తోడవడం-తిట్టడం-బరించలేకపోయింది నాసెల్లి.... ఒకరోజు-ఇంకా ఏడాది కూడా నిండలేదు.... నిన్నెత్తుకుని నడి ఎండలో వొచ్చేసింది.... దొండపండులాంటి పిల్లడు ఇదేమిటే యిలా.... ఏమయిందే.... ఈ పిల్లడు బతుకుతాడా? అని చెల్లెల్ని, తల్లిపాలు తాగే పసిపిల్లవాడినీ చూసి అంతా కన్నీరుమున్నీరయినాము.'

'నిండా నెలదినాలు కూడా మా దగ్గర ఉండలేదు సెల్లి. కన్నవారింటి నుండి పెద్దయ్య వొచ్చాడు. కూతుర్ని తన దగ్గరకు తీసుకుపోవాలని 'రా అమ్మా, అత్తోరింటికెళ్లొద్దు. నీ కన్నోరింటికి రా' అని కూతుర్ని తనతో తీసుకెళ్లిపోయినాడు.

'యే మూర్తాన తీసుకెల్నాడో ఏమో నాకు మరి కనపడలేదు నాసెల్లి. ఆ పొద్దు మంగళోరం. మసక సీకటేల....' అని అమ్మ వలవలా ఏడ్చేసింది. 'నా సెల్లికి....' అమ్మ నోటమాట రావటంలేదు. 'యీ బూమితో రుణం తీరిపోయింది.'

'ఆ రాతిరి రెయిలుబండికి ఎల్నాను. పొద్దుపొడిసేనేళకి రైలు దిగి టేసిను నుండి పొలాల దార్ల ఎల్తున్నాను. ఆ సుట్టుపక్కల ఊళ్లల్ల సూతిలోపడి నాసెల్లి సచ్చిపోయిందని తెలిసిపోయింది - పొలాల్ల పనిసేసుకునే మనుషులు నూసి అడిగితే - ఏ

ఊరు-ఎల్తావమ్మా-అని-నా మాటిని-నీ సెల్లెలేనా అని-.... మూడు కోసుల (కోసెడు = రెండు మైళ్ళు) దారి.... మీ అయ్య అక్కడే ఉన్నాడు..... పోలీసోల్లు సికాకులం (శ్రీకాకుళం) తీసికెళ్ళి..... వొల్లంతా కోసి కోసి..... యిస్తే- అక్కడ ఆ ఏటి ఒడ్డునే - - - బూడిదయిపోయింది నాసెల్లి.....

అమ్మ నూతిలో పడి చనిపోయినప్పుడు, తాత వెళ్లి 'అమ్మా అమ్మా, రా........ రా' అని ఏతాంఅందించినా - పక్కకి తోసేసిందట. పోస్ట్‌మార్టమ్‌కి శ్రీకాకుళం తీసుకుని వెళ్లారు. తర్వాత అక్కడే నాగావళి నది ఒడ్డున అంత్యక్రియలు నాన్న, నలుగురయిదుగురు బంధువులు- చేశారు.

శ్రీకాకుళం వెళ్లినప్పుడల్లా - ఆ నదిలో స్నానం చేసి వస్తూ ఉంటాను. ఆ నదీ జలాల్లో అమ్మ ఉన్నట్టు - అమ్మ నన్ను ముద్దుపెట్టుకుంటున్నట్టు-

'నీనెల్లిన రోజున మీ అయ్య... ఇంకా ఏడుస్తూనే ఉన్నాడు....'

అవును. నాన్న ఆ..... దుఃఖాన్ని తట్టుకోలేకపోయినాడు.

మీ అయ్య - - - పెళ్లం నూతిలోపడి సచ్చిపోయింది తనవల్లే అని బాధపడ్డాడు. ఎందరు ఓదార్చినా ఆ ఏడుపు ఆపుకోలేక పోయినాడు.... చెల్లెల్ని చూడటానికి వెళ్లిన అమ్మను చూసి నాన్న బోరున ఏడ్చాడట.

'పిల్లడ్ని.... నేను పెంచుకుంటాను. నా దగ్గరుంటాడు. అని అడిగితే - సరే అన్నాడు.'

అమ్మ కళ్లనిండా కన్నీళ్లు కురుస్తూనే ఉన్నాయి.

కన్నీళ్లతో కలతలతో ఆ రాత్రి నిద్ర.

* * *

అక్కడ పది రోజులున్నాను. పరీక్ష సంగతి గుర్తురానేలేదు. అమ్మ ప్రేమ. మామిడి పళ్ళు. పనస తొనలు. అరటి పళ్ళు. ఆ తోటల్లో రైతులు. వాళ్ల ప్రేమ. తల్లి లేని పిల్లవాడినని ప్రేమ. మా అమ్మని గుర్తు తెచ్చుకొని..... అంతా అమ్మను గుర్తుచేసుకునేవాళ్లే.....

* * *

పరీక్ష పాసయ్యాను. విశాఖపట్నంలోనే ఉన్నాను. చిన్న ఉద్యోగం. లారీ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో గుమాస్తా. మా లెక్చరర్‌గారి సహాయంతో దొరికింది. మళ్లీ కాలేజీలో చేరి బి.ఎ. చదువుకుంటాను. నాన్న కూడా సంతోషంగా ఉన్నాడు.

ఆ సంతోషంతో అమ్మని చూట్టానికి వచ్చాను.

అమ్మ అరటిగెలలు కొనటానికి వచ్చిన వాళ్లతో మాట్లాడుతున్నది.

నన్నంత దూరంలో చూసి ఆ పని ఆపేసి, ఎదురొచ్చి కావలించుకుంది.

'అమ్మా పరీక్ష పాసయ్యాను. ఉద్యోగమొచ్చింది'

అమ్మకి చెప్పాను

'మీ అమ్మ ఉంటె ఎంత సంతోషించేదో!' అమ్మ గొంతులో ............

'నీ ముఖంలో ఆ సంతోషమంతా కన్పిస్తున్నదమ్మా!'

*

ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక, *11-01-1961*